క్లుప్తంగా

ఖాతాల్లో నగదు మాయం!

రావులపాలెం: నాలుగు రోజులుగా మండలంలోని పలువురి బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అవుతోందని, తమ ప్రమేయం లేకుండా ఖాతాల్లో నగదు డ్రా చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. కొంత మంది ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం బయోమెట్రిక్ వేశామని. ఆ తర్వాతే తమ ఖాతాలోంచి నగదు పోయిందని పేర్కొన్నారు. మరి కొందరు సర్వే కోసం బయోమెట్రిక్ వేయగా, తమ ఖాతాలోంచి డబ్బులు పోయాయంటూ చెబుతున్నారు. దీనిపై బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా, బయోమెట్రిక్ ద్వారా విత్‌డ్రా అయినట్టు బ్యాంకు అధికారులు చెప్పారన్నారు. పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్ తన ఖాతాలోంచి రూ.9,900, ఈతకోటకు చెందిన మానే ప్రసాద్ రూ.5 వేలు, రావులపాలేనికి చెందిన పడాల సత్యనారాయణ రెడ్డి, తేతలి రామచంద్రారెడ్డి రూ, 5 వేల చొప్పున, తేతలి పవన్ సతీష్ రెడ్డి రూ.9,900 పోగొట్టుకున్నట్టు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై రావులపాలెం సీఐ సీహెచ్ ఆంజనేయులను వివరణ కోరగా, బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. సంబంధిత బ్యాంకులకు నోటీసులు ఇచ్చామన్నారు. బాధితులను సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేయాలని చెప్పినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


బ్యాగులు అందుకున్న స్కూలు విద్యార్థులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక అంబేడ్కర్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం దాతలు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. వుండ్రు సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి వుండ్రు రాజేశ్వరి, ఆమె కుమారులు, కోడళ్లు ఐఏఎస్ అధికారులు వుండ్రు రాజశేఖర్, నీర్జా శేఖర్, వుండ్రు లక్ష్మీకాంతారావు, నీలమ్‌రావు ఈ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ ప్రతినిధులు సుధాకర్, నేలపూడి ఆనందరావు, బాబూరావు, కోటి, హెచ్‌ఎం కాజులూరి సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అధికారుల బృందం పరిశీలన

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యలపై ఉన్నతాధికారులు గురువారం పరిశీలన చేశారు. విశాఖపట్నం డీఈ వై.ప్రసాద్ మామిడికుదురు ముస్లిం వీధి, పెదపట్లకాలువ గట్టు ప్రాంతాల్లో పర్యటించి, విద్యుత్ సమస్యలపై స్థానికులను ఆరాతీశారు. లోఓల్టేజ్ సమస్యతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం తదితర సమస్యలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మామిడికుదురు సర్పంచ్ గొస్‌మొహిద్దీన్‌తో పాటు స్థానికులు గ్రామంలోని విద్యుత్ సమస్యలపై డీఈ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాజోలు నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు విశాఖపట్నంలో సీఎండీని కలిసి ఇటీవల వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిశీలనకు సీఎండీ.. ఉన్నతాధికారుల బృందాన్ని పంపించారు. ఈ బృందం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిశీలిస్తోంది.

మోటమర్రి సేవలు అభినందనీయం

రావులపాలెం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన హెచ్‌ఎం మోటమర్రి సుబ్బరాజు చేసిన సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం పదవీ విరమణ చేసిన సుబ్బరాజు దంపతులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సత్కరించారు. విద్యార్థులకు సుబ్బారాజు ఎంతో ఆప్తుడని, ఆయన శిష్యులు ఎంతో మంది నేడు ఉన్నత పదవుల్లో, ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు.

ఏఎన్ఎంల నిరసన

రావులపాలెం: గోపాలపురం పీహెచ్‌సీలో గురువారం ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. వైద్యాధికారులు సాయిలేఖ, స్వాతికి పీహెచ్‌సీ, సచివాలయ ఏఎన్ఎంలు వినతిపత్రాన్ని అందించారు. తాము ఆన్‌లైన్ సేవలు చేస్తే, ఇన్సెంటివ్ ఎంఎల్‌హెచ్‌పీలకు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇకనుంచి తాము ఆన్‌లైన్ సేవలు చేయబోమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

మామిడికుదురు: ఇంటింటికీ కాంగ్రెస్ నినాదంతో ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టామని పీసీసీ సంయుక్త కార్యదర్శులు ఎండీ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ పేర్కొన్నారు. మామిడికుదురులో గురువారం కాంగ్రెస్ పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు బాబి మాట్లాడుతూ తటస్థులను పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తెస్తామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు నీతిపూడి బాలసత్యనారాయణ, గెద్దం వెంకటేశ్వరరావు, నల్లి వెంకటరమణ, చిట్టా జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పెదపట్నంలంకలో కుల గణన సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

తేలనున్న లెక్క!

- సుదీర్ఘ కాలం కల సాకారమైన వేళ
- యుద్ధప్రాతిపదికన కులగణన సర్వే
- మూడు సెగ్మెంట్లలో 90 శాతం పూర్తి

మామిడికుదురు: కుల గణన సర్వే చేపట్టాలని సుదీర్ఘ కాలం నుంచి వివిధ సామాజిక వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా, ఏ ప్రభుత్వం కూడా ఆ దిశగా స్పందించ లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన కుల గణన సర్వేను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఇతర శాఖల ఉద్యోగులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. రేయింబవళ్లు శ్రమకోర్చి నిర్వహిస్తున్న ఈ సర్వే తుది దశకు చేరింది. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, కొన్ని సాంకేతిక పరమైన సమస్యల వల్ల కొంత అవరోధం ఏర్పడినా.. చివరకు సర్వే తుది దశకు చేరుకుంది.

మండలం	సచివాలయాలు	క్లస్టర్లు	గృహాలు	సభ్యులు	పూర్తయిన గృహాలు	పూర్తయిన సభ్యులు
ఆత్రేయపురం	20	321	22,797	64,575	21,357	55,080
ఆలమూరు	24	480	25,990	73,120	23,419	59,016
రావులపాలెం	23	536	30,657	85,402	27,176	68,633
కొత్తపేట	20	410	26,747	78,733	23,402	61,625
అయినవిల్లి	19	360	22,477	64,700	21,082	57,035
పి.గన్నవరం	23	460	25,840	75,298	23,044	60,728
అంబాజీపేట	19	359	21,695	62,893	19,434	53,556
మామిడికుదురు	22	393	23,881	69,248	21,642	58,742
రాజోలు	22	431	25,037	72,013	23,542	64,171
మలికిపురం	23	464	26,550	77,375	23,775	64,171
సఖినేటిపల్లి	21	376	24,831	71,502	22,247	57,196

మూడు నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 236 సచివాలయాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. 4,590 క్లస్టర్లలో జరుగుతున్న సర్వేలో 2,76,502 గృహాలను సందర్శించనున్నారు. 7,94,859 మంది సభ్యులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఇంత వరకూ 2,50,120 గృహాలకు సంబంధించిన సర్వే పూర్తయింది. మొత్తం 6,59,984 మంది సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. గృహాలకు సంబంధించి 90 శాతం, సభ్యులకు సంబంధించి 83 శాతం సర్వే పూర్తయింది. ఇప్పటిరకు 26,382 గృహాలను, 1,34,875 మంది సభ్యులను సర్వే చేశారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ సర్వే పూర్తి చేసే దిశగా యంత్రాంగం శ్రమిస్తోంది.

దేశవ్యాప్తంగా చేపట్టాలి



కుల గణన సర్వే చేపట్టాలని ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్నాం. సుదీర్ఘ కాలం నుంచి చేస్తున్న పోరాటం సాకారం కావడం ఆనందంగా ఉంది. ఈ సర్వే వల్ల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేందుకు అవకాశం ఏర్పడుతుంది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన జనాభా వివరాలు ప్రభుత్వం వద్ద లేక పోవడం వల్ల ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ సర్వే వల్ల ప్రతి కులానికి ఎంతో మేలు జరగనుంది.
– గుబ్బల మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

దశాబ్దం కల సాకారమైంది



కుల గణన సర్వే చేపట్టాలని దశాబ్దం నుంచి డిమాండ్ చేస్తున్నాం. ఇంతవరకూ సాకారం కాలేదు. ఇంత కాలానికి ఈ సర్వే చేపట్టడం అభినందనీయం. కుల గణనతో వివిధ సామాజిక వర్గాలకు చెందిన జనాభా సంఖ్య స్పష్టంగా తెలుస్తుంది. ప్రభుత్వ పథకాలు జనాభా ప్రాతిపదికన కేటాయించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను ప్రతిఒక్కరూ స్వాగతిస్తున్నారు.
– పెయ్యల వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్

కులగణన హర్షణీయం



వివిధ సామాజిక వర్గాలకు చెందిన గణాంకాలు ఈ కుల గణన వల్ల స్పష్టమవుతాయి. దీనివల్ల జనాభా ప్రాతిపదికన ఆయా కులాల వారు రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికంగా సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకునే అవకాశం ఉంటుంది. ఆలస్యంగానైనా ఈ కుల గణన చేపట్టడం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.
– భూపతి మనోహరరాజు, మండల అధ్యక్షుడు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, మామిడికుదురు

ఐరన్ సిరప్ అందజేత


పినపళ్లలో విద్యార్థులకు ఐరన్ సిరప్ డ్రాప్స్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ అందజేశారు. ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ ఇచ్చారు. ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందించనున్నట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎంపీహెచ్ఈఓ కె జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

హోరాహోరీగా పురోహిత క్రికెట్ టోర్నీ

అంబాజీపేట: రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం హోరాహోరీగా జరిగాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో గెలుపొంది ఖమ్మం, కాకినాడ, విజయవాడ, కొవ్వూరు జట్లు సెమీ ఫైనల్స్ చేరాయని నిర్వాహకులు తెలిపారు. సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌ను శుక్రవారం నిర్వహిస్తామన్నారు.

డీజిల్ అక్రమ వ్యాపారంపై ఫిర్యాదు


సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

సఖినేటిపల్లి: తీర ప్రాంత గ్రామాల్లో బయో డీజిల్ పంపుల వద్ద జరుగుతున్న అక్రమ వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని గురువారం మండల పెట్రోల్ పంపుల డీలర్ల సంఘ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు నకళ్లను మీడియాకు ఇచ్చారు. వీరి ఫిర్యాదు ప్రకారం.. అంతర్వేది రాంబాగ్, పల్లిపాలెం ఏరియాల్లో బయో డీజిల్ పంపుల వద్ద ఏవిధమైన సివిల్ సప్లయ్, లీగల్ మెట్రాలజీ శాఖల అనుమతులు లేకుండా డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయి. అంతర్వేది, పరిసర ప్రాంతాల్లో రొయ్యలు, చేపల చెరువులు సాగు చేస్తున్న రైతులకు, పల్లిపాలెంలో వేటకు వెళ్లే సోనా బోట్లకు ఎలాంటి అనుమతుల్లేని బయో డీజిల్ పంపుల ద్వారా అక్రమంగా విక్రయాలు చేస్తున్నారు. తొలుత ఆయా పంపుల వద్ద ట్యాంకుల్లో అక్రమంగా డీజిల్ నింపుతున్నారు. ఆ తర్వాత మోటార్ ఇంజిన్ల సాయంతో ట్యాంకుల్లోంచి ట్రక్కులు, ఆటోల్లో ముందుగా ఏర్పాటు చేసుకున్న డ్రమ్ముల్లోకి డీజిల్‌ను చేరుస్తున్నారు. ఇలా ఆయా ప్రాంతాల్లో రిటైల్ విక్రయాలు కొనసాగిస్తున్నారు. అనుమతుల్లేకుండా డీజిల్ విక్రయిస్తున్న వారిపై, బయో డీజిల్ పంపులపై చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో డీలర్ల సంఘ సభ్యులు మెండు పద్మారావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్, కల్వకొలను దొరబాబు ఉన్నారు. వీరికి మద్దతుగా జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ సంతకం చేశారు.

‘సిద్ధం’ సభకు భారీగా పార్టీ శ్రేణులు

పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు


సమావేశంలో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దెందులూరులో ఈ నెల మూడున జరగనున్న సిద్ధం సభకు పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్తున్నట్టు పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమాఖ్యల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 50 బస్సులు, వందకు పైగా కార్లలో పార్టీ శ్రేణులు తరలివెళ్తున్నట్టు వివరించారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఒక్కొక్క బస్సుకు గ్రామ శాఖ, సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్లను ఇన్‌చార్జిలుగా నియమించినట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, వారి మద్దతు కోరాలని సూచించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, కశిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, కుడుపూడి విద్యాసాగర్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, మోహన్‌సింగ్, మండల జేసీఎస్ కన్వీనర్లు జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, పులిదిండి ప్రభాకర్, దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, ఎం.ప్రశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా త్రిశూలపాణి బాధ్యతల స్వీకరణ

పి.గన్నవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ త్రిశూలపాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇంతవరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.భారతి కృష్ణా జిల్లా పామర్రు మండలానికి బదిలీ అయ్యారు.

ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



మామిడికుదురు: ఎంపీడీఓగా ఎస్.వేణుగోపాల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరెడ్డికి మండల పరిషత్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన కె.వెంకటేశ్వరరావు విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు.

కొత్తపేట ఎంపీడీఓగా వాణి



కొత్తపేట: ఇక్కడి ఎంపీడీఓగా కందుల వాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఇ మహేశ్వరరావు కృష్ణా జిల్లా ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో పనిచేసిన వాణి బదిలీపై వచ్చారు.

ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ



అయినవిల్లి: కొత్త ఎంపీడీఓగా టి.సూర్యనారాయణ మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా ఏలూరుపాడు ఎంపీడీఓగా పనిచేసిన సూర్యనారాయణ మూర్తి ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఎంపీడీఓగా పనిచేసిన తాడి శ్రీవెంకటాచార్య విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి వెంకటరమణ, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఎంపీడీఓ మూర్తికి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం మండలంలోని కొత్తపేట, వాడపాలెం, గంటి, పలివెల, అవిడి, కండ్రిగ, మందపల్లి, ఏనుగుల మహల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం కొమరాజులంక ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ కె.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సేవాభావంతో పని చేస్తేనే గుర్తింపు


డిప్యూటీ తహసీల్దార్ దంపతులను సత్కరించిన ఛాంబర్ ప్రతినిధులు

రాజోలు: ఉద్యోగులు సేవాభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందని తాటిపాక, జగ్గన్నపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అడబాల దొరబాబు అన్నారు. గురువారం ఛాంబర్ కార్యాలయంలో ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న రాజోలు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ దేవళ్ల శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నుంచి శ్రీనివాస్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఛాంబర్ కార్యదర్శి పుల్లేటికుర్తి భవానీశంకర్, ముదునూరి వెంకటపతిరాజు, లక్కింశెట్టి శ్రీనివాస్, ఎండీ కిష్వర్, ఉప్పే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి వెళ్లిన రామేశ్వరం జట్టు


జిల్లా స్థాయి ఫైనల్స్‌లో విజయం సాధించిన రామేశ్వరం జట్టు

సఖినేటిపల్లి: అమలాపురంలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి రామేశ్వరం జట్టు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. ఈ మేరకు జట్టుకు ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు అభినందనలు తెలిపారు. బుధవారం జరిగిన పోటీల్లో వేర్వేరు సెమీ ఫైనల్స్‌లో రామేశ్వరం, పి.గన్నవరం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. గురువారం ఈ రెండు జట్లు మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో రామేశ్వరం జట్టు జిల్లా స్థాయిలో విజయం సాధించింది. ఈ నెల ఐదున విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో రామేశ్వరం జట్టు ఆడుతుంది.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


ముంగండలో జరిగిన వేణు వాయిద్య సంగీత సభ

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో మూడు రోజులుగా జరిగిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి, శ్రీరామచంద్రమూర్తిలకు సహస్ర నామ పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి జరిగిన వేణు వాద్య సంగీత సభ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన మండ అనంతకృష్ణ, వడలి లక్ష్మి వేణు వాయిద్య సహకారంతో ఆర్.దినకర్ (హైదరాబాద్) వయొలిన్‌పై, పారుపల్లి ఫల్గుణ్ (విజయవాడ) మృదంగం, సరస్వతుల హనుమంతరావు (తాడేపల్లిగూడెం) ఘటంపై సహకారంతో సంగీత సభ జరిగింది. ఆయా కార్యక్రమాలకు త్యాగరాజ ఆరాధన సమితి సభ్యులు నడిమింటి నాగరాజారావు, సుందరరావు, పిస్నింటి రామచంద్రశాస్త్రి, సుసర్ల ఉమామహేశ్వర శాస్త్రి, ఖండవిల్లి నాగేశ్వరరావు, జి.శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.


ఖోఖో జిల్లా విజేత జట్టుతో డీఎస్‌డీఓ సురేష్ తదితరులు

ఖోఖో విజేత కొత్తపేట జట్టు

కొత్తపేట: ‘ఆడుదాం ఆంధ్రా’ జిల్లా స్థాయి పోటీల్లో ఖోఖో క్రీడా విజేతగా కొత్తపేట నియోజకవర్గ జట్టు నిలిచింది. జిల్లా కేంద్రం అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన క్రీడా పోటీల్లో ఖోఖో విభాగంలో పి.గన్నవరం నియోజకవర్గ జట్టుపై కొత్తపేట నియోజకవర్గ జట్టు హోరాహోరీగా తలపడి విజేతగా నిలిచింది. ఈ జట్టు ఈ నెల ఆరో తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ ఏఎస్ఎస్ రమాదేవి తెలిపారు. ఈ జట్టును డీఎస్‌డీఓ సురేష్, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీ అభినందించారు.

మహిళల రక్షణకే హిజాబ్

జమాత్-ఎ-ఇస్లామీ హింద్ మహిళల అవగాహన


హిజాబ్‌పై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

రావులపాలెం: హిజాబ్ అనేది ప్రగతికి ఏమాత్రం ప్రతిబంధకం కాదని, అది మహిళలకు రక్షణ కవచం లాంటిదని జమాత్-ఎ-ఇస్లామీ హింద్ మహిళా విభాగం సభ్యులు అన్నారు. ప్రపంచ హిజాబ్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పార్కు వద్ద హిజాబ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల గౌరవాన్ని ఇనుమడింపజేసి, సమాజంలో జరిగే లైంగిక వేధింపుల బారి నుంచి హిజాబ్ రక్షిస్తుందన్నారు. సమాజంలో వికృత పోకడల నుంచి మహిళలకు రక్షణ కల్పిస్తూ, వారికి హుందాతనాన్ని, గౌరవాన్ని కల్పిస్తుందన్నారు. విజ్ఞానం పొందడానికి, అభివృద్ధి సాధించడానికి అడ్డంకి కాదన్నారు. కార్యక్రమంలో సంస్థ సిటీ ప్రెసిడెంట్ ముహతరమా సఫియా సాహిబా, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖదీజతుల్ కుబ్రా, బషీర్, ఉమ్మే ఆసిమ్, షఫీనా, జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

కాలు కోల్పోయిన బాధితుడికి సాయం


బాధితుడికి సాయం అందిస్తున్న నాయకులు

పి.గన్నవరం: మానేపల్లి ఇందిరా కాలనీకి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు దిడ్ల నరసింహారావు ఇటీవల జరిగిన దుర్ఘటనలో కాలు కోల్పోయాడు. అతనికి గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్, సభ్యుల ఆధ్వర్యంలో గురువారం రూ.54 వేల సాయం అందించారు. కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడిపోవడంతో నరసింహారావు కాలును కోల్పోయాడు. బాధితునికి సాయం అందించిన సమితి సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు పితాని నర్సింహరావు, సంస్థ నాయకులు గుబ్బల శ్రీనివాస్, కట్టా నాగమల్లేశ్వరరావు, కడలి రాము, కుక్కల రాము, కట్టా శ్రీను, గుత్తుల మురళి, చెల్లుబోయిన దుర్గాప్రసాద్, కుడుపూడి దుర్గాప్రసాద్, దొమ్మేటి బద్రి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం సర్పంచ్ వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి వసతులకు రూ.10 వేల విలువైన మెటీరియల్‌ను సర్పంచ్ పోతురాజు కిషోర్ అందజేసినట్టు హెచ్‌ఎం పి.సోమ సూర్యకుమారి గురువారం తెలిపారు. ఇందులో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న సింటెక్స్ ట్యాంకు, తాగునీటి పైపులు ఉన్నాయని హెచ్‌ఎం సూర్యకుమారి చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పున్నం వేణు తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రవేశాల కోసం ఈ నెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి పదిన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియెట్ ఎంఈసీలో 40, సీఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

జయహో బీసీ సదస్సు

మామిడికుదురు: టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని పార్టీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. పాశర్లపూడిలో గురువారం జయహో బీసీ సదస్సు జరిగింది. మండల బీసీ సెల్ అధ్యక్షుడు కడలి సూకరాజు అధ్యక్షత వహించారు. పార్టీ నాయకులు రెడ్డి అనంతలక్ష్మి, మొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయపురంలో బీజేపీ ‘పల్లెకు పోదాం’

మలికిపురం: పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బీజేపీ మలికిపురం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం విశ్వేశ్వరాయపురం గ్రామంలో నిర్వహించారు. కన్వీనర్ దెందుకూరి రామలింగరాజు అధ్యక్షత వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, అడబాల సత్యనారాయణ మాట్లాడారు. యువమోర్చా మండల అధ్యక్షుడిగా కట్ట వాసు, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడిగా మేడిచర్ల శ్రీనివాసరావు, ఓబీసీమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గెద్దాడ సత్యనారాయణను నియమించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు పాల్గొన్నారు.